నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం | మార్చి 27, 2024 | www.navatelangana.com

ఎడారిని తలపిస్తున్న త్రివేణి సంగమం


నీరు లేక వెలవెలబోయిన త్రివేణి సంగమం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమంలో నీరు లేక వెలవెలబోతోంది. ఎడారిని తలపిస్తోంది. ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి నీరు వెళ్లిపోవడంతో కందకుర్తి గోదావరిలో ఇసుక దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ప్రతి శుక్ర, సోమవారాలలో పుణ్య స్నానాలకు విచ్చేసిన భక్తులకు అక్కడక్కడ నీటితోనే స్నానాలు ఆచరించి తమ మొక్కలను తీర్చుకుంటున్నారు. గత నెల రోజుల కిందట నిండుకుండలా నున్న గోదావరి వేసవి కాలం ప్రారంభం కావడం.. పంటల కోసం నీటిని విడుదల చేయడంతో నేడు ఇసుక దిబ్బలతో వెలవెలబోతోంది.

బీఆర్ఎస్ ఇంచార్జిగా భాస్కర్‌రెడ్డి



నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జిగా భాస్కర్‌రెడ్డిని నియమించారు. మంగళవారం బాన్సువాడ పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో, ప్రజాప్రతినిధులతో బాన్సువాడ ఎమ్మెల్యే మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జిగా పోచారం భాస్కర్‌రెడ్డిని ప్రకటించారు. పార్టీ కార్యకర్తల, ప్రజాప్రతినిధుల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన వారసుడైన మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ నుంచి బాన్సువాడ ఇన్చార్జి భాధ్యతలను అప్పగించారు.

కాంగ్రెస్‌లోకి మాజీ స్పీకర్..?

- త్వరలో చేరనున్నట్టు ప్రచారం
- సీనియర్ కాంగ్రెస్ నాయకుల్లో ఆందోళన
- కాంగ్రెస్‌లోకి రావొద్దంటూ నిరసనలు

నవతెలంగాణ-వర్ని

కాంగ్రెస్ పార్టీలోకి ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరుతున్న విషయం తెలిసిందే. అయితే బాన్సువాడ నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌లోకి చేరబోతున్నట్టు పుకార్లు వస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన మంచి పదవులలో కొనసాగారు. అందులో మంచి అనుభవం కలిగిన రాజకీయ నాయకుడిగా పేరు పొందారు. కాంగ్రెస్ పార్టీకి బాన్సువాడ నియోజకవర్గంలో మంచి పట్టు ఉండాలంటే, ప్రజలకు పథకాలు అందాలంటే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరితే బాగుంటుందని తన అనుచరుల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతున్నట్టు తెలుస్తోంది. కాగా అందుకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి నాయకుల అభిప్రాయాలతో ఏకీభవిస్తారా? లేక కాంగ్రెస్‌లో చేరరా? అనేది మాత్రం సస్పెన్స్‌గా ఉంది.



ఆందోళనలో కాంగ్రెస్ సీనియర్లు..

పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాబోయే లోక్‌సభ ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీలో చేరాలని కొందరు అభిమానులు కోరుతున్నారని విషయం తెలుసుకొన్న కాంగ్రెస్ ఉమ్మడి మండల నాయకులకు వణుకు పుడుతుంది. మళ్ళీ పోచారం కుటుంబం కాంగ్రెస్ పార్టీలోకి వస్తే.. అన్నీ తానై నడిపిస్తారనే ఆందోళనలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. ఇప్పటికే బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్‌లో వర్గ పోరు ఉంది. అదే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుంటే వర్గపోరులుండవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీలోకి పోచారం శ్రీనివాస్‌రెడ్డి వద్దు..

పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో పార్టీలోకి చేర వద్దు అంటూ.. మంగళవారం పలు మండల కేంద్రాలలో కాంగ్రెస్ నాయకులు సమావేశం ఏర్పాటు నిరసన వ్యక్తం చేశారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వద్దు 'గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. తన కుటుంబ రాజకీయం కోసం ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి చేరాలని పన్నాగం పన్నుతున్నాడని కాంగ్రెస్ పార్టీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరి కొంతమంది రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉండటంతో నియోజకవర్గంలోని లిఫ్టు ఇరిగేషన్లు, పలు అభివృద్ధి పనులు ఉన్నాయని వాటిని ముందుకు సాగించాలంటే ఎమ్మెల్యేగా బాన్సువాడకు ఉన్నటువంటి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోనికి చేరితే అభివృద్ధి జరుగుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏదిఏమైనా పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారా? లేకా బీఆర్ఎస్‌లోనే ఉంటారా? అనేది కొన్ని రోజుల్లో తేలనుంది.

ఏసీబీ వలలో..

భిక్కనూర్ ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్

- తోటి ఉద్యోగి వద్దే లంచం డిమాండ్
- రూ.8వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్ హరిబాబు
- బదిలీపై వెళ్లినా.. లంచం డిమాండ్
- ఏసీబీ అదుపులో భిక్కనూర్ ఎంపీడీవో సంతోష్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తోటి ఉద్యోగి వద్ద రూ.8వేల లంచం డిమాండ్ చేసి ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్ ఏసీబీకి పట్టుబడ్డ ఘటన మంగళవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో చోటుచేసుకుంది. ప్రస్తుతం భిక్కనూర్ ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న సంతోష్‌రెడ్డి డిమాండ్ చేసిన లంచం డబ్బులను కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న హరిబాబు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి..

గతంలో కమ్మర్‌పల్లి మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహించిన భాగయ్య నాలుగైదు నెలల క్రితం బదిలీపై ఇందల్వాయి వెళ్లి, చందూర్‌లో అటాచ్ డ్యూటీలో ఉన్నారు. బదిలీపై వెళ్లిన భాగయ్యకు సర్వీస్ రికార్డు బుక్కును ఆ సమయంలో కమ్మర్‌పల్లి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సంతోష్‌రెడ్డి పంపాల్సి ఉంది. కానీ సర్వీస్ రికార్డు బుక్ పంపకుండా డబ్బులు డిమాండ్ చేశాడు. రూ.10వేలు ఇస్తేనే పంపిస్తామని చెప్పాడు. తర్వాత రెండు మూడుసార్లు అడిగినా.. డబ్బులు ఇస్తేనే పంపిస్తామని స్పష్టం చేయడంతో తన వల్ల అంత డబ్బు ఇవ్వడం కాదని బాగయ్య ఎంపిడిఓ సంతోష్‌రెడ్డికి చెప్పాడు. 'నీకు వేరే బిల్స్ కూడా వచ్చాయి.. అందులో నుంచి ఇవ్వచ్చు కదా.' అని కూడా అడిగడంతో తన వల్ల అంతా కాదని కొంత తగ్గించాలని బాగయ్య కోరడంతో రూ.8వేలు ఇవ్వాలని అడిగాడు. అడిగిన కొద్ది రోజులకే ఎంపీడీవో సంతోష్‌రెడ్డి భిక్కనూర్‌కు బదిలీపై వెళ్ళాడు. ఎంపీడీవో బదిలీపై వెళ్లడంతో సర్వీస్ రికార్డు బుక్ ట్రాన్స్‌ఫర్ అవుతుందని భాగయ్య భావించాడు. కానీ మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ హరిబాబుకు డబ్బులు ఇస్తేనే సర్వీస్ రికార్డు బుక్ పంపించాలని ఆదేశించి వెళ్లాడు. భాగయ్య సర్వీస్ రికార్డు బుక్ గురించి అడిగినా హరిబాబు పంపలేదు. డబ్బులు ఇస్తేనే పంపిస్తామని స్పష్టం చేయడంతో ఏం చేయాలో అర్థం కాక ఏసీబీ అధికారులను సంప్రదించాడు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో బాగయ్య నుంచి డబ్బులు తీసుకుంటున్న సీనియర్ అసిస్టెంట్ హరిబాబును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని రూ.8వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హరిబాబును అదుపులోకి తీసుకొని విచారించడంతో ఎంపీడీవో సంతోష్‌రెడ్డి చెప్పినందునే తాను డబ్బులు తీసుకున్నట్లు స్పష్టం చేయడంతో బదిలీపై భిక్కనూర్ వెళ్లిన ఎంపీడీవో సంతోష్‌రెడ్డిని భిక్కనూర్ మండల పరిషత్ కార్యాలయంలో అదుపులోకి తీసుకున్నారు. తొందరలోనే ఏ1 సంతోష్‌రెడ్డి, ఏ2 హరిబాబును రిమాండ్‌కు పంపిస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. కాగా మండల చరిత్రలో తొలిసారి ప్రస్తుతం విధుల్లో ఉన్న ఒకరు, బదిలీపై మిగిలిన మరొక అధికారి ఏసీబీ అధికారుల వలలో చిక్కుకోవడం సంచలనంగా మారింది. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు నాగేష్, శ్రీనివాస్, వేణు కుమార్ పాల్గొన్నారు.


అధికారులు పట్టుకున్న లంచం డబ్బులు


ఎంపీడీవో సంతోష్‌రెడ్డి


సీనియర్ అసిస్టెంట్ హరిబాబు


బాధితుడు భాగయ్య

ఎంపీడీఓ మారిన.. పేరు మారలే..

నవతెలంగాణ-బోధన్

మండల ఎంపీడీఓగా పనిచేసిన పర్భన్న బదిలీపై వెళ్లి నెల రోజులు గడిచిన పలు గ్రామ పంచాయతీ కార్యాలయం గోడలపై రాసిన సమాచార హక్కు చట్టం బోర్డుపై మాత్రం ఇప్పటికి ఆయన పేరు అలాగే ఉంది. అధికారి మారిన తర్వాత నూతన అధికారి పేరు రాయవలసి ఉన్న ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కాని పట్టించుకోవడం లేదు. దాంతో ఆయా గ్రామ ప్రజలు ఎంపీడీఓ ఎవరు ఉన్నారో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ఎంపీఓ మధుకర్ స్పందించి ప్రతి గ్రామం పంచాయతీల గోడలపై ఉన్న పాత అధికారుల పేర్లు తొలగించి ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న అధికారుల పేరు రాయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం బోధన్ ఎంపీడీఓగా వెంకటేష్ జాదవ్ బాధ్యతలు చేపట్టి సుమారు నెల రోజులు అవుతుంది. ఆయన పేరు గ్రామ పంచాయతీ సమాచార హక్కు బోర్డులపై రాయించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.



మొదటి విడత యాధృచ్చీకరణ ప్రక్రియ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి.పాటిల్


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి

నవతెలంగాణ-కామారెడ్డి

పార్లమెంట్ ఎన్నికల విధుల ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల సిబ్బందికి మొదటి విడత యాధృచ్ఛికరణ (ర్యాండమైజెషన్) ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సమక్షంలో పూర్తి చేశారు. కలెక్టరెట్‌లోని ఎన్ఐసి హాల్లో జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ కలెక్టర్ చంద్రమోహన్ సమక్షంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని 4 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ కోసం పిఓ, ఏపీఓలను నియమించడం వారికి శిక్షణ అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని పోలింగ్ అధికారులకు మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2, 3, 4వ తేదీలలో మాస్టర్ ట్రేట్కునర్లతో శిక్షణ ఉంటుందని చెప్పారు. కామారెడ్డి నియోజకవర్గ ఎన్నికల అధికారులకు కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఉంటుందన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎన్నికల అధికారులకు ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వివరించారు. జుక్కల్ నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులకు ఏప్రిల్ 3, 4వ తేదీల్లో బిచ్కుందలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులకు ఏప్రిల్ 4వ తేదీన బాన్సువాడలోని ఎస్ఆర్ ఎంకే డిగ్రీ కళాశాలలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కోసం మైక్రో అబ్జర్వర్లను నియమించామని, రిజర్వు సిబ్బందిని సైతం అందుబాటులో ఉంచామన్నారు. మొదటి విడతగా మాస్టర్ ట్రైనర్స్‌చే ఎన్నికల విధుల నిర్వహణపై శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల అధికారులకు శిక్షణ పకడ్బందీగా ఇచ్చే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఓ రాజారాం, నోడల్ అధికారి వరద రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

- మహిళను వేధించినందుకు..

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని వాజీద్‌నగర్ గ్రామానికి చెందిన రైతు తన భార్యతో కలిసి సోమవారం గోపాన్‌పల్లి గ్రామ శివారులో గల కౌలు చేసిన భూమి వద్దకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, చిన్న దేవాడ గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు మద్యం మత్తులో వారిని వెంబడించి రైతుతో ఘర్షణకు దిగి మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు వేధింపులకు గురి చేయడంతో మహిళ ఫిర్యాదు మేరకు ఆరుగురు యువకులను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు.

బిల్లులు రాలే



సీతారాంపల్లిలో నూతనంగా నిర్మించిన జీపీ భవనం

- ఇబ్బంది పడుతున్న మాజీ సర్పంచ్‌లు

నవతెలంగాణ-బిచ్కుంద

గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతూ ఉండగా చేసిన అభివృద్ధి పనుల బిల్లులు రాక తాజా మాజీ సర్పంచ్‌లు మానసికంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో గతంలో గెలుపొందిన సర్పంచ్‌లు అప్పులు చేసి గ్రామంలో అభివృద్ధి పనులు చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు.

2022-23 ఆర్థిక సంవత్సరంలో గ్రామపంచాయతీ నూతన భవనాల నిర్మాణానికి రూ.20లక్షల చొప్పున 13 గ్రామ పంచాయతీలలో భవనాలు నిర్మించుటకు నిధులు మంజూరయ్యాయి. మండలంలోని బిచ్కుంద, బండరేంజల్ గ్రామాలలో తప్ప హస్గుల్, శెట్లుర్, మెక్కా, కందర్‌పల్లి, ఫథలాపూర్, గోపన్‌పల్లి, చిన్న దడ్గీ, పెద్దతక్కడ్‌పల్లి, పుల్కల్, మాన్యాపూర్, సీతారాంపల్లి గ్రామాలలో గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణ పనులు మొదలుపెట్టి తాజా మాజీ గ్రామ సర్పంచ్‌లు పనులు పూర్తి చేశారు. చేసిన పనులకు మొదటి దఫా బిల్లు రూ.12లక్షల చొప్పున శెట్లుర్, మెక్కా, పత్లాపూర్, పుల్కల్, మాన్యాపూర్‌కు రాగా రూ.10లక్షలు గోపనపల్లి, 8లక్షలు చొప్పున చిన్నదడ్గీ, సీతారాంపల్లి గ్రామపంచాయతీ భవనాలకు మొదటి దఫా బిల్లులు వచ్చాయి. హజ్గుల్, కందర్‌పల్లి, పెద్దతక్కడపల్లి గ్రామపంచాయతీ నూతన భవనాలకు ఒక దఫా బిల్లులు కూడా రాలేదు. పనులు పూర్తిచేసి నూతన గ్రామపంచాయతీ భవనాలు ప్రారంభించి కార్యాలయంలోనే కార్యదర్శులు, ప్రస్తుత ప్రత్యేక అధికారులు గ్రామపంచాయతీ పాలన వ్యవహారాలు కొనసాగిస్తున్నారు. గత సంవత్సరం నుంచి బిల్లులు రాకపోవడంతో చేసిన అప్పులు కుప్పలై పెరిగిపోతున్నాయని తాజా మాజీ సర్పంచ్లు ఆందోళన చెందుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి కావస్తున్న ఇప్పుడైనా బిల్లులు వస్తాయని ఆశతో ఎదురు చూస్తున్నారు.

నిధుల రాగానే జమ

ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన పనులు పూర్తయిన గ్రామపంచాయతీ భవనాల ఎంబి రికార్డులను పూర్తి చేశాం. ప్రభుత్వం నుంచి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రాగానే గ్రామపంచాయతీ పరిధిలోని ఖాతాలో జమవుతాయి.

- పంచాయతీరాజ్ ఏఈ మధుసూదన్

అప్పుల ఊబి నుంచి కాపాడాలి



గ్రామపంచాయతీ పనులు పూర్తి చేసి గత 16 నెలల క్రితం ప్రారంభించాం. నూతన గ్రామపంచాయతీ కార్యాలయంలోనే పాలన వ్యవహారాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేసి అప్పుల ఊబిలో కూరుకుపోయిన తమను కాపాడాలి.

- గంగారెడ్డి, తాజా మాజీ సర్పంచ్, సీతారాంపల్లి

ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

- దరఖాస్తుకు ఏప్రిల్ 12వరకు గడువు
- ఏప్రిల్ 28న పరీక్ష

నవతెలంగాణ-సదాశివనగర్

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లకు టీఎస్ఆర్డీసీ సెట్-2024ను ఏప్రిల్ 28న నిర్వహించనున్నట్టు ఆయా విద్యాసంస్థలు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. ప్రవేశ పరీక్ష కోసం ఏప్రిల్ 12వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తయిన విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (మర్కల్) కామారెడ్డి ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాధిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లు ఏప్రిల్ 21 నుంచి వెబ్సైట్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. దరఖాస్తు సహా ఇతర వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు పూర్తి ఉచితంగా విద్య, భోజన వసతితోపాటు యూనిఫామ్, పుస్తకాలు, నోట్ బుక్స్ సహా పలు సదుపాయాలను కల్పించనున్నట్టు తెలిపారు.

పది పరీక్షలకు 23 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్, ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియం పదవ తరగతి పరీక్షలకు 11,962 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 11,939 మంది విద్యార్థులు హాజరయ్యారు. 23 రెగ్యులర్ విద్యార్థులు గైర్హాజరు అయ్యారు.

యువకుని దారుణ హత్య


హత్యకు గురైన నవీన్‌కుమార్


కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు


హత్యకు వాడిన కత్తి

నవతెలంగాణ-కామారెడ్డి

యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లి వద్ద మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పాల్వంచ మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన బోయ నవీన్ కుమార్ (23) అనే యువకుడు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం అతని తల్లిని వారి వ్యవసాయ పొలం వద్ద దించి కామారెడ్డికి ఆటోలో తిరిగి వస్తున్న క్రమంలో కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రమేష్‌పల్లి గ్రామ శివారులో ఆరేపల్లి గ్రామానికి చెందిన భువనగిరి మధు, పొందుర్తి ప్రవీణ్ అనే వ్యక్తులు హెల్మెట్లు ధరించి బైకుపై వచ్చి ఆటోను అడ్డగించి ఆటోను ముత్త గౌడ్ పొలంలోకి తీసుకువెళ్లి నవీన్ కుమార్‌పై కత్తితో చాతి పైన, కడుపులో, మెడపైన తీవ్రంగా పొడిచారు. తీవ్ర రక్తస్రావం జరిగిన నవీన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. తన కుమారుడిని చంపిన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడు నవీన్ కుమార్ తండ్రి బోయ పెద్ద నరసయ్య దేవునిపల్లి పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా.. దేవునిపల్లి ఎస్సై రాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- భిక్కనూర్ సిఐ సంపత్
- ప్రమాదకర స్థలాల పరిశీలన

నవతెలంగాణ-దోమకొండ

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని భిక్కనూర్ సిఐ సంపత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సంగమేశ్వర్ గ్రామాల మధ్య ఉన్న ఎడ్ల కట్ల వాగు బ్రిడ్జ్ వద్ద ప్రమాదకర స్థలాలను ఏఆర్టీ టీమ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఏఆర్టీ బృందం సభ్యులు పోలీస్, ఆర్అండ్‌బీ, ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో ప్రమాదకర స్థలాన్ని పరిశీలించి వాటి నివారణ కోసం చర్యలు చేపట్టామని తెలిపారు. గత కొన్ని రోజుల క్రితం ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరిగాయని వాటి నివారణ కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎస్సై గణేష్, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, నాయకులు సీతారాం మధు తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
2
బుధవారం | మార్చి 27, 2024 | www.navatelangana.com

నీటిసమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- ఎంపిడిఒ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

నీటి సమస్య లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ ఆదేశించారు. మండలంలోని పల్లికొండ, పురాణిపేట గ్రామాలను సందర్శించారు. నర్సరీలను పరిశీలించి గ్రామపంచాయతీ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం, నీటి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేసి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఒ జి నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

నూతన చైర్‌పర్సన్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం నూతన మున్సిపల్ చైర్ పర్సన్ అయ్యప్ప లావణ్య శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మండల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు భరత్ చంద్ర మల్లయ్య, కార్యదర్శి శ్రీ విద్య ప్రవీణ్ పవార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లా డుతూ.. ప్రైవేట్ ,ప్రభుత్వ పాఠశాలలు రెండు కళ్ళ లాంటివని, దేశ ఉన్నతి కోసం అందరు కలిసి కట్టు గా కృషి చేయాలని కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పరిసర ప్రాంత ప్రజలు నాణ్యమైన విద్యకోసం హైదరాబాద్, బెంగుళూరు లాంటి పట్టణాలకు వెళ్ళే అవసరం లేకుండా అంతే నాణ్యమైన విద్యను తక్కువ ఫీజులతో అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంతి గంగారెడ్డి, మానస గణేష్, గోపీ కృష్ణ, నలంద ప్రసాద్, వంశీ ప్రజ్ఞ, మోడల్ ఆలూరు మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



ఇద్దరికి రెండురోజుల జైలు శిక్ష

- మద్యం తాగి వాహనం నడిపినందుకు..

నవతెలంగాణ-కంఠేశ్వర్

మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి రెండురోజుల జైలుశిక్ష విధించారు. 12 మందికి ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ట్రాఫిక్ సీఐ వెంకటరమణ మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం కోర్టులో కోర్టు మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ ముందర హాజరు పరిచారు. 10 మందికి 11300 రూపాయల జరిమానా మరో ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించిచినట్టు టాఫిక్ ఏసిపి నారాయణ తెలిపారు.

రాష్ట్రస్థాయి కెసెట్‌లో నలంద విద్యార్థులకు ర్యాంకులు


విద్యార్థులకు సన్మానించిన పాఠశాల యాజమాన్యం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లిలోగల నలంద హై స్కూల్ ఈ- అభ్యాస్ అకాడమీ హైదరాబాద్ వారు సమిష్టిగా విద్యార్థుల ప్రతిభను పెంచడానికి నిర్వహిస్తున్న ఐఐటి, ఒలంపియాడ్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌లో భాగంగా ఫిబ్రవరి 25న నిర్వహించిన కలాం ఆప్టిట్యూడ్ టెస్ట్ లెవెల్ -1 ,లెవెల్ -2 రాష్ట్ర వ్యాప్తంగా 600లకు పైగా విద్యార్థులు ఈ ఎగ్జామ్స్ రాశారు. ఈ కాంపిటేటివ్ పరీక్షలు నలంద విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏడవ తరగతిలో సిహెచ్. హనీ రెడ్డి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ , నాలుగవ తరగతిలో పెరుగు. యువరాజ్ స్టేట్ థర్డ్ ర్యాంక్ లు కైవసం చేసుకుని ఆదర్శంగా నిలిచారు. మిగిలిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో టాప్ 100 లోపు ర్యాంకులు సాధించారు. రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం సన్మానించారు. స్టేట్ ర్యాంక్ సాధించిన ఈ ఇద్దరు విద్యార్థులకు వచ్చే ఆదివారం హైదరాబాద్‌లోని భారతీయ విద్య భవన్ ఆడిటోరియంలో సన్మానం నిర్వహించనున్నట్టు పాఠశాల యాజమాన్యం తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించడం కొరకు కృషిచేసిన విద్యార్థులకు, ఐఐటి, ఒలంపియాడ్‌ఉపాధ్యాయులకు పాఠశాల యాజమాన్యం అభినందించారు.

రంజాన్‌లో సేవచేయడంలోనే తృప్తి

- హైవే సెక్షన్ అధికారి సుబ్బారావు


నిత్యావసర సరుకులను అందజేస్తున్న హైవే ఫారెస్ట్ అధికారి సుబ్బారావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రతి ఏటా రంజాన్ మాసంలో ముస్లిం నిరుపేదలకు తమ వంతుగా నిత్యావసర వస్తువులను అందజేయడంతోనే తమకు ఏడాదంతా తృప్తి కలుగుతుందని ఇందల్‌వాయి హైవే ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఎం. సుబ్బారావు అన్నారు. మంగళవారం డిచ్‌పల్లి మండలంలోని కమలాపూర్ ఫారెస్ట్ సెంట్రల్ నర్సరీలో ఉపాధి పనిచేసే 13 మంది ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగను పురస్కరించుకొని నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా సెక్షన్ అధికారి ఎం సుబ్బారావు మాట్లాడుతూ రంజాన్ మాసంలో తమ తల్లి ఎం. సరోజా ముస్లిం నిరుపేదలకు నిత్యాసర సరుకులను పంపిణీ చేస్తూ ఉండేవారన్నారు. కులాలకు మతాలకు అతీతంగా తమ వంతుగా సహాయ సహకారాలు అందజేస్తున్నారని తెలిపారు. తల్లి అడుగుజాడల్లో తనయుడు నడవడం అభినందనీయమని తోటి యానంపల్లి సెక్షన్ అధికారి బాపురావు అన్నారు. కార్యక్రమంలో బిట్ అధికారిని సాయి దీప్తి, స్టయికింగ్ ఫోర్స్ సిబ్బంది హరీష్, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

- తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఆర్మూర్ డివిజనల్ అధికారి శివకృష్ణ


మాట్లాడుతున్న డివిజనల్ అధికారి శివకృష్ణ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని అన్ని జీపీల్లో 100 శాతం పన్నుల వసూళ్ళను సాధించాలని ఆర్మూర్ డివిజనల్ అధికారి శివకృష్ణ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఆర్మూర్ డివిజనల్ పంచాయతీ అధికారి శివకృష్ణ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సకాలంలో పారిశుద్ధ్య పనులను నిర్వహించాలని కోరారు. వేసవి కాలం ఉన్నందున గ్రామాలలోని ప్రజలకు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.సమావేశానికి ముందు ఏర్గట్ల జీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పన్నుల వసూళ్ళను పరిశీలించారు. మంగళవారం ఒకేరోజు 78,600 రూపాయల పన్నుల వసూళ్ళు చేయడంతో పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్‌ను, కారోబార్లను అభినందించారు.ఎంపీఓ శివ చరణ్, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, అనిల్, శ్రీకాంత్, రాకేష్, రవి, భార్గవ్, భాజన్న సంధ్య పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ సజావుగా సాగేలా కృషి చేయాలి

- ఏప్రిల్ 01 నుంచి అందుబాటులోకి కొనుగోలు కేంద్రాలు
- రైతులు ఏ దశలోనూ ఇబ్బందులు పడకూడదు
- సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులు అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలని అన్నారు. రబీ వరి ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో మంగళవారం ఆయా శాఖల అధికారులతో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, సీఈఓలు, ఐకెపి సీసీలు, మెప్మా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏప్రిల్ 01 వ తేదీ నుండి జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో యాసంగిలో సాధారణానికి మించి అధిక విస్తీర్ణంలో వరి పండించారని, 11.72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి చేతికందుతుందని అంచనా వేశామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈసారి జిల్లాలో 462 కొనుగోలు కేంద్రాల ద్వారా 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ వెల్లడించారు. వీటిలో సహకార సంఘాల ఆధ్వర్యంలో 417 కేంద్రాలు, ఐకెపి ద్వారా 39, మెప్మా ఆధ్వర్యంలో 06 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తిస్థాయిలో మద్దతు ధర పొందేలా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం 'ఏ' గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ. 2203, సాధారణ రకానికి రూ. 2183 ధర చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలోనూ రైతులకు అవసరమైన అన్నిమౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంట విక్రయం విషయంలో రైతులు ఇబ్బందులకు గురికాకుండా, పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా కేంద్రాల వద్ద తగిన నీడ, నీటి వసతి కల్పించాలన్నారు. సరిపడా సంఖ్యలో తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రైతులకు నష్టం వాటిల్లకుండా తూకం, తరుగు వంటి అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని, ధాన్యం సేకరణ ముగిసేంత వరకు పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తిస్థాయి మద్దతు ధర అందేలా చూడాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలకు సంబంధించి ఇదివరకటి తరహా నియమ, నిబంధనలే అమలులో ఉంటాయని, అయితే ఈసారి కొత్తగా సెకండ్ ఓటీపీలో ఐరిస్‌ను కాప్చర్ చేయడం జరుగుతుందని వివరించారు. సంబంధిత శాఖల అధికారులందరూ సమిష్టిగా, సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు లోబడి బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్యపరచాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతుల నుండి ఏ చిన్న ఫిర్యాదు సైతం రాకుండా చూసుకోవాలని, ధాన్య సేకరణలో క్షేత్రస్థాయి అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణాకు సరిపడా సంఖ్యలో వాహనాలను సమకూర్చుకోవాలని, ధాన్యం ఎగుమతులు, దిగుమతులు వెంటదివెంట జరిగేలా అవసరమైన సంఖ్యలో హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ చేసేందుకు తగిన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, బాగా ఆరబెట్టిన, శుభ్రపర్చిన ధాన్యం మిల్లులకు పంపాలని అన్నారు. కాగా, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున కొనుగోలు కేంద్రాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులతో ప్రారంభోత్సవాలు చేయించకూడదని, అధికారులు ప్రారంభించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఫ్లెక్సీలలో కూడా ఫొటోలు ఉండకూడదని, కేవలం రైతులకు ఉపయోగపడే సూచనలు మాత్రమే ముద్రించాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు ధాన్యం కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు. నాణ్యతా ప్రమాణాలను సాకుగా చేసుకుని రైతులను నష్టపర్చే ప్రయత్నాలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, రైతుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశమైనందున ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కేంద్రాలకు సమకూరుస్తామని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట రైస్ మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ధాన్యం సేకరణ సజావుగా నిర్వహించాలని, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలని అన్నారు. సమావేశంలో డీఎస్ఓ చంద్రప్రకాశ్, సివిల్ సప్లయిస్ డీ.ఎం జగదీశ్, జిల్లా మార్కెటింగ్ అధికారిణి గంగూబాయి, సహకార శాఖ అధికారి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియకు శ్రీకారం

- కలెక్టర్ పర్యవేక్షణలో నిర్వహణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసి హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు(పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ)లను, ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓ)లను ర్యాండమైజెషన్ ద్వారా కేటాయించారు. రిజర్వ్ సిబ్బందిని కలుపుకుని జిల్లా పరిధిలోని ఆరు సెగ్మెంట్లకు గాను మొత్తం 7711 మంది పోలింగ్ సిబ్బందిని నియమిస్తూ ర్యాండమైజేషన్ జరిపారు. వీరిలో పీఓలు 2008 మంది ఉండగా, ఏపీఓలు 2056, ఓపీఓలు 3647 మంది ఉన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్లతో పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ విధుల కోసం నియమించబడిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సీపీఓ జి.మల్లికార్జున్, శ్రీకాంత్, ఎన్ఐసి అధికారి రవికుమార్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి బాధ్యతలు

- డిసిసిబి చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార సంఘం బ్యాంక్ చైర్మన్‌గా కుంట రమేష్ రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. డీసీసీబీ భవనం మీటింగ్ హాల్‌లో డిసిఓ ఎన్.శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టటిన రమేష్ రెడ్డి కి పలువురు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిసిసిబి చైర్మన్ కుంట రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. 21న అవిశ్వాసం నెగ్గడంతో తనపై నమ్మకంతో డైరెక్టర్లు సహకరించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు, డైరెక్టర్లకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. దీనికి సహకరించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్‌కు కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని అన్నారు. ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడకుండా బ్యాంకు అభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు. సహచర డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు. డిసిఓ ఎన్. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. మార్చ్ 21న అవిశ్వాసం నెగ్గడంతో చైర్మన్ పదవి ఖాళీ కావడంతో ఈనెల 26న నామినేషన్ ప్రక్రియ నిర్వహించామని తెలిపారు. చైర్మన్ పదవికి కుంట రమేష్ రెడ్డి ఒక్కరే నాలుగు సెట్లు నామినేషన్ వేశారని స్క్రూటిని అనంతరం ఒక్కరే ఉండడంతో కుంట రమేష్ రెడ్డిని ఏకగ్రీవంగా డిసిసిబి చైర్మన్‌గా ప్రకటించామని అన్నారు. రమేష్ రెడ్డికి నియాక పత్రాలు అందజేశామని అన్నారు. పాలక వర్గం 20 మందికి గాను 16 మంది హాజరు అయ్యారని అన్నారు. కార్యక్రమంలో డిసిసిబి సీఈవో నాగభూషణం వందే, డైరెక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


డిసిఓ శ్రీనివాస్‌రావు చేతుల మీదు నియామకపత్రాన్ని అందుకుంటున్న రమేష్‌రెడ్డి

పెంచిన టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి

- నిరుద్యోగులపై ఆర్థిక భారం మోపడం సరికాదు
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



టెట్ పరీక్ష ఫీజు అధికంగా పెంచడం వల్ల నిరుద్యోగులపై పెను భారం పడుతుందని, గతంలో ఒక పేపర్ రాస్తే 200, రెండు పేపర్లు రాస్తే 300 ఫీజు ఉండేది కానీ ఇప్పుడు ఒక పేపర్‌కి 1000, రెండు పేపర్లు రాస్తే 2000 రూపాయల ఫీజు పెట్టడం సరికాదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశ పరీక్షలు ఫీజులు తగ్గించి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. ఎన్నికల హామీకి విరుద్ధంగా అధిక ఫీజు పెట్టారని, లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులు టెట్ పరీక్షకు సన్నద్ధమవుతున్నారని చెప్పారు. ఇప్పటికే బీఆర్ఎస్ పాలనలో పరీక్ష ఫీజులు కట్టి, కోచింగ్ తీసుకొని పరీక్షల్లో అవకతవకల వల్ల నిరుద్యోగులు ఆర్థికభారంతో ఉన్నారని, రేపటి నుంచి టెట్ పరీక్ష ఫీజు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో పాత ఫీజునే తీసుకోవాలని అన్నారు. పరీక్ష సెంటర్లను కూడా నిరుద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా సెంటర్ల సంఖ్య కూడా పెంచాలని, దీని వల్ల నిరుద్యోగుల పై ప్రయాణ భారం తగ్గనుందని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉండాలని, ప్రభుత్వం, అధికారులు పెంచిన టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలని రఘురాం డిమాండ్ చేశారు.

ధర్మ భిక్షంకు నివాళి



ధర్మ భిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అమరజీవి కామ్రేడ్ ధర్మ బిక్షం 13వ వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. ధర్మ భిక్షం గౌడ్ సాయుధ రైతాంగ తెలంగాణ పోరాటంలో వీరోచిత పోరాటం చేశారని అన్నారు. దున్నే వానికే భూమి, గీసే వానికే చెట్టు కావాలని జరిపిన పోరాటంలో 8 సంవత్సరాల పాటు జైలు జీవితం గడిపి అనంతరం జరిగిన ఎన్నికల్లో శాసనసభ్యులుగా, పార్లమెంటు సభ్యులుగా పనిచేశారన్నారు. ప్రజా సమస్యలు, గీతా కార్మికుల సమస్యలు పరిష్కరించారని తెలిపారు. గీత కార్మికులకు సొసైటీలను ఏర్పాటు చేసిన ఘనత ధర్మ బిక్షందేనని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పి. నర్సింగరావు, బి రఘురామ్, అంజలి, సఖి సురేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మొవ్వ నాగేశ్వర రావుకు నివాళి

- గొర్రెపాటి మాధవరావు, జంపాల చంద్ర శేఖర ప్రసాద్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ జంపాల చంద్రశేఖర ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ట్రస్టీ, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, సీపీఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ సభ్యు లు, రిటైర్డ్ హెడ్ మాస్టర్, పౌరహక్కుల సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మొవ్వ నాగేశ్వర రావు(88) మంగళవారం మాక్లూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వారి ఇంట్లో మృతిచెందారని పౌరహక్కుల సంఘం నాయకులు గొర్రెపాటి మాధవరావు, జంపాల చంద్రశేఖర్ తెలిపారు. ఆయన నెలరోజులుగా అనారోగ్యంతో ఉన్నారని, ఆయన గుంటూరు జిల్లా పెదనందిపాడులో జన్మించారని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఉపాధ్యాయులుగా ఉద్యోగం రావడంతో తెలంగాణాకు వచ్చారని, తన చిన్ననాటి స్నేహితురాలు, సహాధ్యాయి తులసి వీరి సతీమణిఅని, వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారన్నారని తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యమంలో జిల్లా నేతగా పని చేశారని తెలిపారు. పీడీఎస్‌యూ నిర్మాతల్లో ఒకరైన జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్‌లో మొవ్వా నాగేశ్వర రావు ఒక ట్రస్టీ అని అన్నారు. నాగేశ్వర రావు పార్థివ దేహాన్ని వారి కోరిక ప్రకారం కుటుంబ సభ్యులు బుధవారం నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి, వైద్య విద్యార్థుల అధ్యయనం కోసం అందచేస్తారని చెప్పారు.

గాలికుంటు నివారణ టీకాలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



పశువుల కు గాలికుం టు వ్యాధి నివారణ టీకా లు వేయడం అత్యంత ప్రాముఖ్యం అని మండల పశువైద్యాధికారి శిరీష మంగళవారం అన్నారు. మండలం లోని అర్గుల్ గ్రామంలోని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్కి భగవాన్ ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-కామారెడ్డి
జిల్లా కేంద్రంలోని కల్కినగర్‌లో గల శ్రీ పరంజ్యోతి కల్కి భగవాన్ ఆలయంలో మంగళవారం సందర్భంగా గత మూడు సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని యధావిధిగా నిర్వహించారు. కాగా మంగళవారం అన్నదాన కార్యక్రమానికి అన్నదాతలుగా గంగెల్లి వీరప్రసాద్, మౌనిక ముందుకు వచ్చినట్టు వివరించారు. వీరికి శ్రీ పరంజ్యోతి కల్కి సేవా సమితి తరపున సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


అన్నదానం చేస్తున్న పలువురు

పన్నులు చెల్లించి అభివృద్ధికి పాటుపడండి

నవతెలంగాణ-ఎడపల్లి
గ్రామపంచాయతీ అభివృద్ధి కొరకు స్థానిక యజమానులు ఇంటి పన్నులతో పాటు కులాయి పన్నులను సకాలంలో చెల్లించి గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకారాన్ని అందించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి గ్రామస్థులను కోరారు. మార్చి మాసంలో 100శాతం ఇంటి పన్ను వసూలు చేయాలనే నిబంధనలు ఉన్నాయని ఆయన తెలిపారు. మంగళవారం మండలంలోని మంగళ్‌పాడ్, కుర్నపల్లి, ఎడపల్లి ఆయా గ్రామాలలో గ్రామపంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్నును వసూలు చేశారు.


పన్నులు వసూలు చేస్తున్న అధికారులు

నీటి ఎద్దడి ఉండొద్దు

• ఎంపీపీ బుద్దె సావిత్రి

నవతెలంగాణ-బోధన్
గ్రామాలలో వేసవి నీటి కొరత లేకుండా పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, అలాగే మండల స్థాయి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని బోధన్ ఎంపిపి బుద్దె సావిత్రి అన్నారు. మంగళవారం బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఎండాకాలం సందర్భంగా గ్రామాలలో ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే అకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మండల సర్వసభ సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరు కావలసి ఉన్నా.. వ్యవసాయ, విద్య, పౌరసరఫరాల శాఖల తరపున తహసీల్దార్ గంగాధర్ మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారుల స్థానంలో కిందిస్థాయి సిబ్బంది హాజరై నివేదిక అందించారు. పశుసంవర్ధకశాఖ మండల వైద్యులు రాకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది నామమాత్రంగా వివరాలు వెల్లడించారు. అనంతరం సాలూరా పీహెచ్.సీ వైద్యురాలు రేఖ సెలవులో ఉండడంతో పెగడపల్లి పిహెచ్.సీ వైద్యురాలు డాక్టర్ జవేరియా వైద్య శాఖ అందిస్తున్న వివరాలను ప్రకటించారు. ఎంపీఓ మధుకర్ గ్రామాలలో పంచాయతీ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను వివరించి, గ్రామస్తులు పంచాయతీలకు పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే తాగునీటి సమస్య తలెత్తినచోట మండల స్థాయి అధికారులకు ప్రజా ప్రతినిధులు సమాచారం ఇవ్వాలని కోరారు. తగ్గెల్లిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో గ్రామస్తులు ఎంపీడీవో దృష్టికి తీసుకురావడంతో ఆయన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ఆదాయంపై ఉన్న చిత్తశుద్ధి అధికారులకు గ్రామంలోని సమస్యలు పరిష్కరించడంలో లేదని హూన్స సొసైటీ చైర్మన్ మందర్న రవి సమావేశంలో అధికారులను నిలదీశారు. సాలూరు మండలంలో 9600 ఉచిత విద్యుత్ పథకానికి లబ్ధిదారులు ఎంపిక అయ్యారని ట్రాన్స్‌కో అధికారి తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి సంతోష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు వేదికల ద్వారా శాస్త్రవేత్తలతో రైతులకు ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేసిందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బోధన్ మండలానికి మహిళా సంఘాలకు కోటి రూపాయల వడ్డీ రాయితీ మంజూరైందని ఐకెపి ఎపిఎం వినోద్ కుమార్ తెలిపారు. ఎంఈఓ నాగనాథ్ పదవ తరగతి పరీక్షల విధులలో బిజీగా ఉండడంతో ఆయన స్థానంలో కార్యాలయ సిబ్బంది నివేదిక సమర్పించారు. సోషల్ వెల్ఫేర్ శాఖ, రోడ్లు భవనాల శాఖ అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. అలాగే పలు గ్రామాల ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంతో సమావేశం నామమాత్రంగా కొనసాగింది. ప్రతి సమావేశానికి కూడా మండల స్థాయి అధికారులు సక్రమంగా హాజరు కాకపోవడంపై ప్రజాప్రతినిధులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమావేశానికి మండలస్థాయి అధికారులు గైర్హాజరు కావడంపై గతంలోనే మండల సమావేశంలో తీర్మానం చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన వారిలో మార్పు రాకపోవడం గమనార్హం. ఈ సమావేశంలో బోధన్ తహశీల్దార్ గంగాధర్, ఎంపీడీఓ వెంకటేశ్ జాదవ్, ఎంపీఓ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ

యూపీఎస్సీ సీశాట్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

• జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి.దయానంద్

నవతెలంగాణ-కామారెడ్డి
తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గల మైనారిటీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ శిక్షణ కేంద్రంలో యూపీఎస్సీ సీశాట్ 2024-25 సంవత్సరానికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు, ఈ మేరకు అర్హులైన అభ్యర్థుల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి.దయానంద్ తెలిపారు. యూపీఎస్సి సీశాట్ శిక్షణకు (100) మంది డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైను, బుద్ధిష్ట్, పార్శి) అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రిజర్వేషన్ల ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరీలో వికలాంగులకు 3శాతం సీట్లు కేటాయించినట్టు తెలిపారు. అభ్యర్థులు ఇతర విద్యాసంస్థల్లో ఏ రకమైన కోర్సు, ఉద్యోగం చేయకుండా కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షలకు మించి ఉండకూడదని వివరించారు. పై అర్హతలు కలిగి ఆసక్తి గల అభ్యర్థులు (www.tmreistelangana.cgg.gov.in) వెబ్‌సైట్‌లో 12.04.2024 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మైనారిటీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కోరారు. పూర్తి వివరాలకు 040-23236112 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.



చిల్లరే జీవనాధారం

• నీటి ప్రవాహం తగ్గడంతో వెతుకులాట


చిల్లర డబ్బులు ఏరుకుంటున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్
ప్రత్యేక పూజల కోసం గోదావరి నదికి వచ్చిన భక్తులు అందులో వేసిన చిల్లర డబ్బులే కొందరికి జీవనాధారంగా మారింది. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం వద్ద నీటి ప్రవాహం గణనీయంగా తగ్గిపోవడంతో ప్రధాన ఘాట్‌ల వద్ద నెర్రలు ఏర్పడ్డాయి. అయితే భక్తులు వేసిన చిల్లర డబ్బులను కొందరు పేదలు వెతికి జీవనాధారంగా మార్చుకుంటున్నారు. గోదావరిలో స్నానాలు ఆచరించిన సమయంలో భక్తులు చిల్లర డబ్బులు వేస్తుంటారు. నీటి ప్రవాహం తగ్గడంతో ఆడబ్బులను కొందరు పేదలు వెతుక్కుని జీవనం సాగిస్తున్నారు.

మొరం టిప్పర్లు పట్టివేత

నవతెలంగాణ-బోధన్
బోధన్ పట్టణ శివారులోని బెల్లాల్ నుంచి మొరం అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను సోమవారం రాత్రి పట్టుకున్నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. బెల్లాల్ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా మొరం అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్న నేపథ్యంలో సోమవారం రాత్రి మొరం అక్రమంగా తవ్వుతూ తరలిస్తున్న రెండు టిప్పర్‌లను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పట్టుకున్న టిప్పర్లను బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గత వారం రోజులుగా అర్ధరాత్రి సమయంలో మొరం తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్లను పట్టుకుని ఠాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

నాగిరెడ్డిపేట్ గ్రామ కమిటీ ఎన్నిక


ఎన్నికైన గ్రామ కమిటీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
నాగిరెడ్డిపేట్ కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నట్టు కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మన్నే వెంకటి, ఉపాధ్యక్షుడిగా బయమొల్ల సాయగౌడ్, యూత్ ప్రెసిడెంట్‌గా పల్లె రాజు, బీసీ సెల్ అధ్యక్షునిగా మా అన్నయ్య యాదయ్య, మైనార్టీ అధ్యక్షుడిగా ఎండి షకీల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా తలారి అవంతిని ఏకగ్రీవంగా నియమించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బోయిని విటల్, లక్ష్మణ్, శ్రీనివాస్‌గౌడ్, సాయగౌడ్, బోయిని హనుమాన్లు, భీమయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి


మట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-నిజాంసాగర్
వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులకు గ్రామాలలోని తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి గ్రామంలో కూడా వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయించాలని సూచించారు. అన్ని గ్రామాలలో కూడా ఉపాధి హామీ పనులను నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి యాదగిరి, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ-లింగంపేట్
మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు మంగళవారం లింగంపేట్ జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు సమక్షంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని, కష్టపడ్డ వారికి కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం ఇస్తుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని, స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మోతే మాజీ సర్పంచ్ రామ్‌రెడ్డి, కిషన్, శెట్టిపల్లి గ్రామస్తులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ వేతనాలు చెల్లించాలి

• విధులు బహిష్కరించిన హాస్పిటల్ కార్మికులు

నవతెలంగాణ-బోధన్
బోధన్ జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సంబంధించిన మూడు నెలల పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్ మాట్లాడుతూ.. బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్ కార్మికులకు పెండింగ్లో ఉన్న 3 నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు గత మూడు నెలల వేతనాలు చెల్లించాలని ఈనెల 6వ తేదీన అధికారులకు సంబంధిత కాంట్రాక్టర్‌కు సమ్మె నోటీస్ ద్వారా తెలిపినా ఇప్పటికీ వేతనాలు ఇవ్వలేదని దాంతో సమ్మె నిర్వహించి నిరసన తెలుపుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే 3 నెలల పెండింగ్ వేతనాన్ని చెల్లించాలని, ఇతర సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శంకర్, నాగమణి, సతీష్, జాఫర్, మాధవి, కేజియా, సాయిలు, దత్తు కార్మికులు పాల్గొన్నారు.


విధులు బహిష్కరించిన నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

విద్యుత్ షాక్‌తో నివాసపు గుడిసె దగ్ధం

• రూ.లక్షా 50 వేలు ఆస్తి నష్టం

నవతెలంగాణ-లింగంపేట్
విద్యుత్ షాక్‌తో నివాసపు గుడిసె దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.లక్షా 50 వేలు ఆస్తి నష్టం వాటిల్లింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని నల్లమడుగు పెద్ద తాండకు చెందిన బనావత్ కిషన్ రోజువారీగా సోమవారం రాత్రి తన నివాసం గుడిసెలో కుటుంబ సభ్యులతో పాటు నిద్రిస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మంటలు చెలరేగడంతో నిద్రలో నుంచి లేచి ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశారు. మంటలు ఆర్పడానికి ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వారు అరుపులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. మంటలు చుట్టూ వ్యాపించకుండా జాగ్రత్త పడ్డారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా.. సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పేశారు. ఈ అగ్ని ప్రమాదంలో రూ.10వేల నగదు, అర్ధతులం బంగారం, 30 తులాల వెండి, వంట సామాగ్రి, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. ఘటనా స్థలాన్ని మంగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య చేరుకొని పంచనామా నిర్వహించారు. విద్యుత్ శాఖ వల్లే ప్రమాదం జరిగిందని బాధితుడు తెలిపారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయామని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరాడు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారి

కే.ఆర్.కే సన్ షైన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

• హెల్మెట్‌తో వచ్చిన రైతును అభినందించిన సీఐ

నవతెలంగాణ-కామారెడ్డి
కే.ఆర్.కే సన్‌షైన్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మేనేజింగ్ అండ్ డైరెక్టర్ మహమ్మద్ ఖాలిలుల్లా ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణంలోని సుభాష్ రోడ్డులో చలివేంద్రాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. చలివేంద్రాన్ని ప్రారంభించి తర్వాత అక్కడికి వచ్చిన వారికి చల్లటి నీళ్లు అందిస్తున్న సమయంలో అక్కడికి ఓ రైతు చల్లని నీరు తాగడానికి చేతులో హెల్మెట్ తీసుకొని వస్తే ఆయనకు స్వీటు, పండ్లు ఇచ్చి నీలాగా అందరూ ఇలాగే ఉండాలని అతనిని సీఐ అభినందించారు. ఈ సందర్భంగా కే.ఆర్.కే సన్ షైన్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మేనేజింగ్ అండ్ డైరెక్టర్ మహమ్మద్ ఖలీల్లుహ మాట్లాడుతూ.. ఎండలు తీవ్రంగా కొడుతున్నాయని మా తండ్రి మహమ్మద్ రషీద్ అహ్మద్ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం చలివేంద్రం కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మంగళవారం కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుభాష్ రోడ్‌లో ప్రారంభించినట్టు వివరించారు. కార్యక్రమంలో మహ్మద్ కలీం, నేహా, జమున, లత, హజి, అలిమ్, అబ్దుల్ లతీఫ్, ప్రవీణ్, సాజియా, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న సీఐ

లింగంపేట్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులుగా ప్రసాద్ గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-లింగంపేట్
లింగంపేట్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షునిగా పోతగోని ప్రసాద్‌గౌడ్‌ను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆదేశానుసారం కార్యకర్తల సమక్షంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నవీద్, ప్రధాన కార్యదర్శిగా తిరుమల కిరణ్, సంయుక్త కార్యదర్శిగా శ్రావణ్ కుమార్, కుమ్మరి సాయిలు, కోశాధికారిగా భాస్కర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా వినోద్ కుమార్, కమ్మరి శేఖర్, జీవన్, ముదాం స్వామి, అర్జున్ ఎరుకల రవి, రాజును ఎన్నుకున్నారు. అదేవిధంగా పట్టణ యూత్ అధ్యక్షులుగా అబ్దుల్ ఖయ్యూంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా అద్దమన్, ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్, సంయుక్త కార్యదర్శి మూగ సాయిలు, కార్యవర్గ సభ్యులుగా సందీప్, శశాంక్, మజీద్, సాయికుమార్, నదీమ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులకు శాలువా కప్పి సన్మానించారు. వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బుర్ర నారాగౌడ్, యూత్ మండల అధ్యక్షులు సుప్పాల రాజు, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ నగేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జొన్నల రాజు, కౌడ రవి, భైరయ్య, పతియోద్దీన్, జక్సాని రవికుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికైన గోతగోని ప్రసాద్‌గౌడ్‌కు సన్మానం

ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

• బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

నవతెలంగాణ-జుక్కల్
ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి అనిల్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రయివేట్ ఫంక్షన్ హాలులో జుక్కల్ ఎంపిపి సుర్నార్ యశోదా నీలుపటేల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల విండో చైర్మెన్‌లు, పాలకవర్గం సభ్యులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపిపిలు, జడ్పీటీసీలు, గ్రామీణస్థాయి ప్రజాప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయానికి జ్యోతి, దీపారాధన, హుండీ వితరణ


హుండీని వితరణ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-పిట్లం
మండలంలోని అల్లాపూర్ హనుమాన్ మందిరానికి రూ.21వేల విలువ గల జ్యోతి, దీపారాధన, హుండీని గ్రామ హనుమాన్ సైన్యం ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా హనుమాన్ సైన్యం అధ్యక్షుడు మాట్లాడుతూ.. కొన్నేండ్ల నుంచి తమ గ్రామ హనుమాన్ మందిర అభివృద్ధికి నోచుకోలేదని, ప్రస్తుతం హనుమాన్ సైన్యం ముందుకొచ్చి తమ వంతు సహాయంగా ప్రజల అవసరాలకుగానూ జ్యోతి, దీపారాధన, హుండీలను అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ సైన్యం ఉపాధ్యక్షుడు సాయి సుధీర్, ప్రధాన కార్యదర్శి విట్టల్, కోశాధికారి శంకర్, సభ్యులు సాయిరెడ్డి, సురేందర్‌రావు, బాలాజీ రావు, సాయిరాం, సంతోష్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, కాంతరెడ్డి, హనుమంతురెడ్డి, మల్గొండ, బసేందర్, పండరి రావు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మాధవ నగర్ లోని సాయిబాబా మందిరంలో అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రవీందర్ ఆధ్వర్యంలో 89 రోజులకు గాను ఉన్న హుండీని మంగళవారం లెక్కించగా 1,92,549 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సాయిబాబా మందిరం సిబ్బంది కే గంగాధర్, హరితారాణి మాణిక్య శర్మ, కే సంతోష్ కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.


హుండీని లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అధిక సంఖ్యలో కూలీలకు పని కల్పించాలి : ఎంపీడీఓ

నవతెలంగాణ-మోపాల్

ఈ వారం అధిక సంఖ్యలో కూలీలకు కుంట చెరువు దగ్గర పని కల్పించాలని ఎంపీడీవో లింగం నాయక్ ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. మంగళవారం ఆయన న్యాల్కల్ గ్రామాన్ని సందర్శించారు. మంచినీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చూస్తానని ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీ సెక్రెటరీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



లిక్కర్ స్కాంలో తప్పు చేసిన వారికి శిక్ష పడేలా చూడాలి

- టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

లిక్కర్ స్కాంలో ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించి, పరిశోధించి తప్పు చేసిన వారికి శిక్ష పడేలా చూడాలని టిడిపి నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టు కావడం సిగ్గుచేటని, మహిళ లోకం తల దించుకునేలా లిక్కర్ స్కాంలో ప్రధాన సూత్రధారిగా ఉండటం హేయమైన చర్య అని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నయీం ఆస్తులు జప్తు చేసింది, కనీసం వాటి వివరాలు తెలియదు, 4000 కోట్ల రూపాయలు డంప్ దొరికిందన్నారు ఆ డంప్ ఎవరింట్లోకెళ్లింది నయీమ్ భూములు ఎవరి పేరుపై మారాయో పూర్తిగా సిఎం రేవంత్ రెడ్డి ఎంక్వయిరీ చేయించి చర్యలు తీసుకోవాలని కోరారు. టెట్ పరీక్షకు ఒక సబ్జెక్టుకు రూ.1000 తీసుకోవడం బాధాకరమని, ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉండాలని ఇలాంటి అప్లికేషన్ ఫీజు పెట్టొద్దని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్, బిజినెస్ సెల్ బొబ్బ నరసింహారావు, టిఎన్టియుసి రాష్ట్ర నాయకులు కొయేడి నర్సింలు, అర్బన్ సిరియా నాయకులు కల్లేడ గంగాధర్, శంకర్ ముదిరాజ్, లవంగ రాజు, రవి కుమార్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

- ట్రాఫిక్ ఏసీపీ నారాయణ
- ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ నారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రజల మన్ననలు పొందాలని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ అన్నారు. మంగళవారం రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ట్రాఫిక్ ఏసిపి టి. నారాయణ హాజరై మాట్లాడారు. ఆటోలు లైసెన్స్ లేనివారికి ఆటోలు అద్దెకు ఇవ్వరాదని, రాత్రి పగలు తేడా లేకుండా సేవ చేస్తున్న ఆటో డ్రైవర్లకు అభినందనలు అని అన్నారు. ఎవ్వరూ కూడా మద్యం తాగి ఆటోలు నడుపరాదని, ఓవర్ లోడ్ ఎక్కించుకోరాదని, ఫోన్ మాట్లాడుతూ ఆటో నడుపరాదని ట్రాఫిక్ రూల్స్ (నిబంధనలు) ప్రతి ఒక్కరూ పాటించాలని ఎవ్వరూ కూడా ఎక్కువ ట్రిప్పులు కొట్టాలని తొందరపడకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆటోలను రోడ్డు పక్కన మాత్రమే పార్క్ చేసుకోవాలని, ఎక్కడపడితే అక్కడ నిలుపడం వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. ఆటోలకు నెంబర్లు లేకుండా నడుపరాదని, రిజిస్ట్రేషన్ నెంబర్ కనపడేలా ఉండాలని, ఆటోలకు నెంబర్ సిస్టమ్ ఉండడం వల్ల దొంగతనాలు, ప్రమాదాలు జరిగినప్పుడు తొందరగా గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళా ప్రయాణికులు ఎక్కినప్పుడు మర్యాదపూర్వకంగా మాట్లాడాలని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఏసిపి ఎల్. రాజా వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి. వెంకట నారాయణ, టౌన్ సిఐ. బి. నరహరి, టౌన్-1 ఎస్‌హెచ్‌ఓ డి. విజయ్ బాబు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది హాజరయ్యారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కేటుగాళ్లపై చర్యలు కఠినతరం అయ్యేనా?

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని అంగడి బజార్ వద్ద స్క్రాప్స్ దుకాణంలో భారీ ఎత్తున మోటర్లు, మీటర్లు గవర్నమెంట్‌కు సంబంధించిన అల్యూమినియం కరెంటు తీగలు హార్వెస్టర్ పిస్టిన్ మోటర్లు, బ్యాటరీలు లక్షల్లో ఉన్న సామాగ్రి సోమవారం పోలీసులు పట్టుకోవడం తీవ్ర సంచలనం అయింది. అంగడి బజార్లో ఉన్న స్క్రాప్స్ దుకాణంలో దొరకడంతో సంబంధిత బాధితులు భారీ ఎత్తున తరలివచ్చి అక్కడ ఉన్న సామాగ్రిని ట్రాక్టర్లో ఎక్కించి ఆ సామాగ్రిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇవి దొరికిన కొద్ది దూరంలో ఒక షట్టర్ రూమ్‌లో భారీ ఎత్తున సామాన్లు రూంలో పెట్టి తాళం వేసి ఉండడంతో కొందరు గమనించి పోలీసుల సహాయంతో షట్టర్ రూమ్ తాళాలను తీపియడంతో భారీ ఎత్తున దాచిపెట్టిన సామాన్లు బయటపడ్డాయి. ఘటనా స్థలాన్ని ఎస్సై అశోక్ ఏఎస్ఐ చిన్నయ్యలో సందర్శించి కేసు నమోదు చేశారు.


పోలీసులు పట్టుకున్న కరెంటు తీగలు, హార్వెస్టర్ పిస్టన్ మోటర్లు

ఆగని రాగి తీగల చోరీలు

గత సంవత్సరం నుండి పట్టణ ప్రాంతంలో ఉన్న వ్యవసాయ భూముల వద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏకంగా ధ్వంసం చేస్తూ రాగితీగలు, ఆయిల్‌లను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. విద్యుత్ తీగలను ముట్టుకోవాలంటే సాధారణంగా ఎవరైనా భయపడతారు. కానీ ఈ వరుస చోరీలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఆస్తి నష్టం వాటిల్లుతుంది. ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది అమర్చడానికి కొంత సమయం పడుతుంది. ప్రస్తుతం యాసంగి చివరి దశ కావడంతో ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు స్థలాల వద్దనే....

ఈ చోరీలు వ్యవసాయ స్థలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్దే జరుగుతున్నాయి. పంట పొలాల దగ్గర రాత్రి సమయాల్లో ఎవ్వరు ఉండరన్న ధీమాతో దొంగతనానికి దొంగలు ఎగపడుతున్నారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగలను ఎత్తుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారు .

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం...

నెలకింద జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ల రాగి తీగలు ఆయిల్ చోరీలపై మా అధికారులు సైతం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గ్రామాల్లోనూ రాత్రుల్లో గస్తీ తిరిగేలా చర్యలు తీసుకుంటూ, గ్రామస్తులకు అవగాహన సైతం కల్పిస్తున్నాం.
- హరిచంద్‌నాయక్, విద్యుత్ శాఖ డిఈ, ఆర్మూర్.

ఒక్క నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు కెపాసిటీని బట్టి 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుంది. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చోరీలకు గురవుతున్న సామాగ్రి విలువ 20 వేల పైన ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గత సంవత్సర కాలం నుండి పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కొత్తది ఏర్పాటు చేసేందుకు కనీసం నాలుగు ఐదు రోజుల సమయం సైతం పట్టవచ్చు..

గత సంవత్సర కాలం నుండి....

గత సంవత్సరం మార్చి నెలలో మండలంలోని అంకాపూర్ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి తీగలు, ఆయిల్ ఎత్తుకెళ్లినారు.. మండలంలోని ఫతేపూర్, గోవింద్‌పేట్, ఇస్సాపల్లి, రాంపూర్, దేగాం, పట్టణంలోని యానం గుట్ట సమీపంలోనూ, మామిడిపల్లిలో వ్యవసాయ భూముల వద్ద చోరీలు జరిగాయి.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యం

- ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో 'నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా" 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని యూనివర్సిటీ ఎన్ఎస్‌యుఐ కమిటీ ఆధ్వర్యంలో క్రీడా కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. యాదగిరి మాట్లాడుతూ యూనివర్సిటీ విద్యార్థుల వికాసానికి చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అయన అన్నారు. డాక్టర్ దత్త హరి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు క్రీడలు కూడా భాగమన్నారు. యూనివర్సిటి ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు కోమిర శ్రీశైలం మాట్లాడుతూ.. యూనివర్సిటీలో విద్యార్థుల్లో నైపుణ్యం, ఆరోగ్యానికి క్రీడలు ప్రధానమైనవని వివరించారు.


పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ యాదగిరి

కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ యూనివర్సిటీ కమిటీ నాయకులు రాజేందర్, సాగర్, నాయక్, నిరంజన్, శ్రీకాంత్, విజయ్, కుమార్, అశ్విన్, అనిల్, నవీన్, అనిల్, నంద తదితరులు పాల్గొన్నారు.

బర్ధిపూర్‌లో ఎన్ఎస్ఎస్ శిబిరం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిషిత కామర్స్ అండ్ సైన్స్ కళాశాల నిజామాబాద్ ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు డిచ్ పల్లి మండలలలోని బర్ధీపూర్ గ్రామంలో ఏడు రోజుల వేసవి ప్రత్యేక శిబిరం మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం వల్ల విద్యార్థులు తమలో తాము మార్పు తెచ్చుకోవాలని, గ్రామ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జయంత్ మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ యొక్క ప్రాముఖ్యత, ఏడు రోజుల క్యాంపులో గ్రామాన్ని క్లీన్ అండ్ గ్రీన్ ప్లాస్టిక్ అవేర్నెస్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించాలని అన్నారు. పదిమందిలో ఉన్నప్పుడు మనవల్ల ప్రయోజనం ఉండాలి.. లేదా మనవల్ల మరొకరికి మేలు కలగాలని అన్నారు. ఆ విధంగా పరస్పర సహకారంగా, పరోపకారంగా, మంచిగా మెలగటమే సంఘసేవ అని చెప్పారు. ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలు చేయడానికి అవకాశం కల్పించిన గ్రామప్రజలకు, గ్రామ కార్యదర్శికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా సి.రాజు, కళాశాల ప్రిన్సిపల్ ఎస్. జయంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి. రాజన్న, గ్రామ కార్యదర్శి, విడిసి సభ్యులు పాల్గొన్నారు.


శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

పోషన్ పక్వాడాపై సమీక్ష


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఐజిడిఓసి కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖా ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా సందర్భంగా సమన్వయ సమావేశం మంగళవారం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈనెల 9నుండి 23వరకు అంగన్వాడి కేంద్ర స్థాయి, మండల స్థాయి, ప్రాజెక్ట్ స్థాయిలో జరిగిన కార్యక్రమాలను, ఎస్ ఏఎం, ఎంఏఎం, పిల్లలకు అందిస్తున్న సేవల వివరాలను, అంగన్వాడి కేంద్రాల్లో ఉన్న మౌలిక సదుపాయాల గురించి సమీక్ష నిర్వహించారు, జిల్లా సంక్షేమ అధికారిణి యస్ కే రసూల్‌బీ అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారి సుదర్శనం, సమగ్ర శిక్షా అభియాన్ సెక్టోరల్ ఆఫీసర్ పి శ్రీనివాస్, జిల్లా వెనుక బడిన తరగతుల శాఖా సహాయ అధికారి టీ కిషన్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి నాగరావ్, మిషన్ భగీరథ ఎక్స్ క్యూటివ్ ఇంజనీర్ కే.రాకేశ్, ఆయుష్ డిపార్ట్మెంట్ కోఆర్డినేటర్ యస్ రాంమోహన్, జిల్లా పంచాయతీ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, మండల స్థాయి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, ఏపి యంలు, సీడీపీవోలు, సూపర్ వైజర్లు పోషణ్ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు .

రుణాలు చెల్లించి అభివృద్ధికి పాటుపడండి

- పీఏసీఎస్‌లో సంఘ మహాజన సభ



మాట్లాడుతున్నన సంఘ సభ్యులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండలకేంద్రంలోని పీఏసీఎస్ లో సంఘ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య అధ్యక్షతన సంఘ మహాజన సభ నిర్వహించారు. సంఘ కార్యదర్శి జక్కని శ్రీనివాస్ సంఘం యొక్క ఆదాయ, వ్యయాలను సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం పీఏసీఎస్ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య మాట్లాడుతూ... పంటల కోసం ఎరువులను,వారికి కావలసిన రుణాలను అందిస్తున్నామని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, సంఘ వైస్ చైర్మన్ సిగసారం గంగారాం,డైరెక్టర్లు బద్దం ప్రభాకర్, హన్మాండ్లు, కొలిప్యాక శ్రీనివాస్, రేండ్ల రాజారెడ్డి, జుంగల పెద్ద గంగారాం, ఇరపట్నం పెద్ద గంగారాం, భూదేవి, సాయమ్మ, పెద్ద కిషన్, భీమ గంగాధర్, గున్నవ్వ, తదితరులు పాల్గొన్నారు.

47 మంది గైర్హాజరు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పదవ తరగతి భౌతిక శాస్త్రం పరీక్ష మంగళశారం నిర్వహించడం జరిగిందని జిల్లా విద్యాధికారి ఎన్వి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మొత్తం 141 పరీక్ష కేంద్రాలలో 22024 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 21977 మంది పరీక్షరాయగా 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. డీఈవో 04 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ 32 పరీక్ష కేంద్రాలను తనిఖీలు నిర్వహించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్స్ 141 మంది విధులు నిర్వహించారని అన్నారు.

ఊరూరా కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేయాలి

- వరికి క్వింటాలుకు 500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలి
- హామీలు నెరవేర్చకుంటే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదు
- 100 రోజుల గడువు ముగిసింది
- రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలి
- లేకుంటే ప్రజా కోర్టులో నిలదీస్తాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

శాసనసభ ఎన్నికల్లో చెప్పిన 100 రోజుల గడువుపూర్తయినందున కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని.. లేకుంటే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం వేల్పూర్ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పుష్కలమైన సాగు నీరు, 24 గంటల కరెంట్, రైతుబంధు ఇచ్చామన్నారు. 110 రోజుల కాంగ్రెస్ పరిపాలనలో కరెంట్ కష్టాలు, సాగునీరు సరిగా ఇవ్వక.. ఎండిపోయిన బోర్లు, కాలిపోతున్న మోటార్లతో రైతులకు దు:ఖమే మిగిలిందన్నారు. కాంగ్రెస్ తెచ్చిన కరువుతో పంటలు ఎండుతున్న ఈ ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ నాయకత్వంలో కాళేశ్వరం రివర్స్ పంపింగ్ ద్వారా కింద గోదావరి నుంచి నీళ్లను శ్రీరామ్ సాగర్ తీసుకొచ్చి తద్వారా వరద కాలువ, కాకతీయ కెనాల్ సంవత్సరం పొడుతా నిండుగా ఉంచి రైతులకు నీళ్ల అందించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు నెలలు కాలేదని, రైతులు సాగునీరు అడుగుతుంటే పంటలకు నీళ్ల ఇవ్వలేక పోతున్నారని విమర్శించారు. పైపెచ్చు పోచంపాడ్ డ్యామ్ నుండి వరద కాలువ ద్వారా ఆ లోకేషన్ కంటే ఎక్కువ నీరు కిందికి తరలిస్తూ ఇక్కడి రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని, దీనికి ఇక్కడి కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కప్పల వాగు, పెద్ద వాగులో అనేక చెక్ డ్యామ్‌లు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించామన్నారు. ప్యాకేజ్ 21 ద్వారా కప్పల వాగు, పెద్దవాగులో నీళ్ల కూడా వదిలి వాటిని నీటితో నింపినట్లైతే ఆ వాగు వెంబడి ఉన్న గ్రామాల్లో బోర్లలో నీళ్ల వచ్చి సుమారు 40 వేల ఎకరాలకు లాభమయ్యేదన్నారు. వాగులల్లో ఒక 0.5 టీఎంసీ నీరు వదిలాలని ఎన్ని సార్లు రైతుల తరపున విన్నవించిన, లేఖలు రాసిన ఈ చెవిటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రైతులకు నాలుగు ప్రధాన హామీలు ఇచ్చి వాటిని 100 రోజులలో అమలు చేస్తామని చెప్పి నట్టేట ముంచారన్నారు. కాంగ్రెస్ ఏం మొహం పెట్టుకొని పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అడుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే డిసెంబర్ లోనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 110 రోజులు కూడా గడిచిందన్నారు. వెంటనే రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఏం చెప్పారో తమకూ సంబంధం లేదని రుణాలు కట్టాల్సిందేనని బ్యాంకు అధికారులు గ్రామాల్లో రైతులను లీగల్ నోటీసులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన రూ.2లక్షల రుణమఫి హామీని నెరవేర్చకుంటే ఈ పార్లమెంట్ ఎలక్షన్‌ల్లో ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. సంవత్సరానికి రెండు పంటలకు కలిపి ఎకరానికి రూ. 15వేలు రైతు భరోసా పంట సహాయం ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం కంటే ఎక్కువ కౌలు రైతులకు కూడా పంట సహాయం ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటి వరకు 3 ఎకరాలకు మించి ఉన్న రైతులకు పంట పెట్టుబడి డబ్బులు వేయలేదన్నారు. గతంలో కేసిఆర్ ప్రభుత్వం జిల్లాలో సుమారు 490, బాల్కొండ నియోజకవర్గంలో 100కు పైగా ఊరూరా కొనుగోలు కేంద్రాలు పెట్టి ప్రతి గింజ కొనుగోలు చేయడమే కాకుండా కొన్న వారం, పది రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. హామీలేవి నెరవేర్చకుండా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎట్లా ఓట్లు అడుగుతారు...కాంగ్రెస్ పార్టీకి ఓట్లు ఎందుకు వేయాలో రైతన్నలు ఒకసారి ఆలోచించాలని కోరారు. వరి ధాన్యాన్ని క్వింటాలుకు అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి ఆఖరి గింజ వరకు కొన్న తర్వాతనే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. సందర్భంగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు ఇచ్చిన హామీల వీడియోలను, గ్యారెంటీ కార్డులో రైతులకు పేర్కొన్న హామీలను ప్రదర్శించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు, ఎంపిపి, జెడ్పిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | మార్చి 27, 2024 | www.navatelangana.com

లిక్కర్ పట్టివేత

- కేసు నమోదు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సుద్దులం గ్రామానికి చెందిన కొత్తపల్లి సందీప్ వద్ద ఉన్న లిక్కం ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీఎంసీ కాలేజీ వద్ద దేవపల్లి వెళ్లే రోడ్డు వద్ద ఎన్నికల కోడ్ అమలులో ఉండగా పెద్ద మొత్తంలో ఎలాంటి అనుమతులు లేకుండా లిక్కర్ తీసుకువెళ్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు మంగళశారం ఎస్ ఐ మహేష్ తన సిబ్బందితో కలసి వెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్కువ మొత్తంలో లిక్కర్ తీసుకువెళ్తున్న సందీప్‌ను పట్టుకుని ఆయన వద్ద లభించిన 54.6 లీటర్ల లిక్కర్‌ను స్వాధీన పర్చుకున్నట్లు వివరించారు. దీని విలువ 13,650 రూపాయలు ఉంటుందని, కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కందకుర్తి చెక్‌పోస్ట్ వద్ద ముమ్మర తనిఖీలు

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని కందకుర్తి చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం ముమ్మర తనిఖీలను చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని, మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు. స్థానిక పోలీస్ సిబ్బందితోపాటు, ఫారెస్ట్, ఎక్సైజ్, తదితర శాఖల అధికారులు తనిఖీలను చేపట్టారు. డబ్బులు, మద్యం సరఫరా కాకుండా మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

సరిపడా తాగునీరు అందేలా ఏర్పాట్లు

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-బోధన్

వేసవికాలం దృష్ట్యా బోధన్ పట్టణ సమీప గ్రామాల ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా కావలసిన ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బోధన్ పట్టణ సమీపంలోని బెల్లాల్ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి బెల్లాల్ చెరువు నీటిని పట్టణ ప్రజల సౌకర్యార్థం తాగడానికి వినియోగిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం కాలువలను పూడిక తీయక వదిలేయడంతో నీటి సరఫరాలో ఇబ్బందిగా మారిందన్నారు. కాలువలను కానీ భూములను కానీ రైతులు కబ్జాలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పంట కోతలు పూర్తి అయిన వెంటనే కాలువల మరమ్మతులు చేపడతామని, తద్వారా నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ అధికారులు మూడు ఫీట్ల మేరకు నీళ్ల పారేలా చూడాలన్నారు. ఐదారు రోజుల్లో బెల్లాల్ చెరువు నుండి పట్టణ ప్రజల సౌకర్యార్థం తాగునీటిని అందించేలా చేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టణానికి సమీపంలోని గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేసిన ఆ గ్రామాలకు కావలసిన సౌకర్యాలు చేయలేదని అన్నారు. మిషన్ భగీరథ నీరు సింగూరు నుంచి వస్తున్న క్రమంలో పైపులైను మరమ్మతులకు గురవుతున్నాయని వాటిని సరిచేసి తాగునీటి ఇబ్బందులు తీరుస్తామన్నారు. బోధన్‌లో ఎక్కడ కూడా తాగునీటి ఇబ్బందులు లేవని తెలిపారు. పట్టణ వాసులకు అందించే తాగునీటిని పూర్తిగా నీటి శుద్ధికరణ చేసి పంపిణీ చేయాలని అధికారులు ఆదేశించారు. లేకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేసవికాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బోధన్ పట్టణ శివారులోని బెలాల్ చెరువులో ఉన్న నీటి సామర్థ్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక రైతులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిజాంసాగర్ ప్రాజెక్టు అధికారితో ఫోన్లో మాట్లాడి బెలాల్ చెరువుతోపాటు అలీ సాగర్ ప్రాజెక్టు నింపేందుకు నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. నీరు వృథా పోకుండా తక్కువ క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఇప్పటికే ఎండలు తీవ్రమవుతుండటంతో నీటి ఆవిరి పెరిగి చెరువులో నీటిమట్టం తగ్గిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి బోధన్ తాగునీటి అవసరాల నిమిత్తం నీటిని విడుదల చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని ఆయన చెప్పారు. జిల్లాలోని చెరువులలో గుర్రపు డెక్క పెరిగిపోయిందని తెలిపారు. దీని నివారణకు అవసరమైన నూతన టెక్నాలజీ ద్వారా చర్యలు చేపట్టేందుకు అధికారులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఆయన వెంట టిపిసిసి ఉపాధ్యక్షుడు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డి.ఈ లోక్ నాయక్, కౌన్సిలర్ లు తూము శరత్ రెడ్డి, దామోదర్ రెడ్డి, ధూళిపాళ పౌల్, ఇంద్రకరణ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాషా మొయినుద్దీన్, నాయకులు గంగా శంకర్, నాగేశ్వర రావు, నరేందర్ రెడ్డి, రవీందర్, ఇబ్రహీం, సంజీవ్ రెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి

- డిసిసి కార్యదర్శి దేగ పోశెట్టి



మాట్లాడుతున్న దేగ పోశెట్టి

నవతెలంగాణ-మాక్లూర్

ఆలూరు మండలంలోని కల్లేడ గ్రామంలో గ్రామ కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిసి కార్యదర్శి దేగ పోశెట్టి పాల్గొని మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో కాంగ్రెస్ గ్యారంటీలను వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు పులిమంటి ప్రకాష్, మాజీ సర్పంచ్ ఎడ్ల పోశెట్టి, మాజీ ఎంపిటిసి బండారి రమేష్, మాజీ ఉప సర్పంచ్ నీలగిరి శ్రీనివాస్, ఆలూర్ మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సిరికొండ మహేష్, కొండ్రా శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.

డైరెక్టర్ కల్చరర్ యాక్టివిటీస్, యూత్ వెల్ఫేర్ అధికారిగా లావణ్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి



నియామకపత్రం అందజేస్తున్న రిజిస్ట్రార్

తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యాయన శాఖ ప్రొఫెసర్ కరిమిండ్ల లావణ్య కు డైరెక్టర్ కల్చరర్ యాక్టివిటీస్ మరియు యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా నియామకపు ఉత్తర్వులను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బుర్ర వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి మంగళవారం అందజేశారు. ప్రొఫెసర్ లావణ్య బాలికల వసతి గృహ వార్డెన్ గా, పరీక్షల అదనపు కంట్రోలర్‌గా, ఉమెన్ సెల్ డైరెక్టర్‌గా, పబ్లికేషన్ సెల్ కో-ఆర్డినేటర్‌గా, దక్షిణ ప్రాంగ ప్రిన్సిపాల్ గా, తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షులుగా, పాఠ్య ప్రణాళిక అధ్యక్షులుగా వివిధ పదవులను సమర్థవంతంగా నిర్వహించారు.

ఓబీసీ మోర్చా మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన మోర్చా మండల కమిటీ

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ బిజెపి మండల అధ్యక్షుడు రాంరెడ్డి ఆధ్వర్యంలో ఓబీసీ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షులుగా కటికే రమేష్, ప్రధాన కార్యదర్శిగా పెట్టిగాడి ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా చాకలి రమేష్, దొడ్లె సంగం, మామిడి రాకేష్, జాదవ్ శ్రీనివాస్‌రావు, జంగం ప్రవీణ్, కార్యదర్శులు కొడగంటి శేఖర్, కోట్ల రమేష్, ఏమన్నగారి నందురావు, బాలకిషన్, కోశాధికారి జోగిని ఎల్లన్న, కార్యవర్గ సభ్యులు ఆకుల సాయిలు, ఎర్రవాటి సంతోష్, జోగిని సతీష్, దార్వయి రాంప్రసాద్, ఆకుల శ్రీకాంత్, లస్కర్ ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, ప్రధాన కార్యదర్శులు అమృత భూంరావు, మార మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాత ఉపాధ్యాయుల సమస్యలపై చర్చిస్తాం

- పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్



రాజేందర్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఉపాధ్యాయుల సమస్యలను ఎన్నికల తర్వాత చర్చించడానికి సంఘం ఎల్లవేళలా కృషి చేస్తుందని పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ అన్నారు. పట్టణంలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్‌లో మంగళవారం జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్ తాండ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మట్ట రాజేందర్ పదవీరమణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా పిఆర్టియు అధ్యక్షులు పొద్దుటూరి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్, డివిజనల్ ఇంచార్జి, జక్రాన్‌పల్లి మండల అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి , ఆర్మూర్ డివిజనల్ ఇన్చార్జి తుమ్మల లక్ష్మణ్ పటేల్ పత్రిక సంపాదకులు పెంట జలంధర్, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు..

కోటగిరిలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభించిన ఎంపీటీసీ

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అభయ హస్తం ఫౌండేషన్ నిర్వాహకులు బర్ల గంగారం కుటుంబీకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీటీసీ కొట్టం మనోహర్ మంగళవారం ప్రారంభించారు. వేసవిలో తాగునీటికి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుడా చలివేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని మనోహర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు బర్ల మధు, బర్ల శ్రీధర్, కొత్తపల్లి విండో అధ్యక్షులు డాక్టర్ సునీల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షాహిద్, జెడ్పిటిసి శివరాజ్ దేశాయ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం కోనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

నవతెలంగాణ- కామారెడ్డి



మాట్లాడుతున్న శాంతికుమారి

యాసంగి 2023-24 వరి పంట కోనుగోలు నిమిత్తం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు, సిఎంఆర్ డెలివరీ, తాగునీటి ఎద్దడి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సిఎస్ సమీక్ష నిర్వహించారు.



పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. జిల్లాలో 347 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిలో సహకార సంఘాల ద్వారా 325, ఐకెపి ఆధ్వర్యంలో 22 దాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ మొదటి వారంలో బాన్సువాడ, బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పంట కోతలకు అనుగుణంగా ప్రారంభించాలన్నారు. ఎక్కడ ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోకుండా చూడాలని, అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తూ రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై ఎక్కడ ఇబ్బందులేకుండా కొనుగోలు ప్రక్రియ ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలని సూచించారు.

జిల్లాలో 347 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం దిగుబడి మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్దం చేసుకున్నామని తెలిపారు. యాసంగి సీజన్లు గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాళ్ల 2 వేల 203 రూపాయలు, సాధారణ రకం ధాన్యానికి క్వింటాళ్ల 2 వేల 183 రూపాయల మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు.

జిల్లాలోని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మౌళిక వసతులు, టార్పాలిన్లు, క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు ఏర్పాటు చేయాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం 17 లోపు ఉండాలనే అంశాలపై రైతులకు విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ తెలిపారు.

ధాన్యం కొనుగోలు నిమిత్తం అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి సంబంధిత మిల్లర్లకు కేటాయించాలని, రైస్ మిల్లు వద్ద ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కోత రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైస్ మిల్లర్ల వద్ద హమాలీల కొరత రాకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రైతులు ధాన్యాన్ని తీసుకుని వచ్చే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వరి సాగు చేస్తున్న రైతులకు సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్యాగింగ్ చేయాలని, ప్రణాళిక బద్ధంగా కొనుగోలు కేంద్రం వద్దకు రైతు ధాన్యం తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఖరీఫ్ 2023-24 సీజన్ కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ భారత ఆహార సంస్థకు సకాలంలో డెలివరీ చేసే విధంగా రైస్ మిల్లులను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో డిఆర్డిఓ చందర్ నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ ఆర్డీవోలు రఘునాథరావు, ప్రభాకర్, రమేష్, సిపిఓ రాజారాం, కలెక్టరేట్ ఎవో మసూర్ అహ్మద్, సహాయ పౌరసరఫరాల అధికారి నిత్యానంద్, తాగునీటి శాఖ అధికారులు పాల్గొన్నారు.

పోతంగల్ చెక్‌పోస్ట్ వద్ద రూ.2.29 లక్షలు పట్టివేత

నవతెలంగాణ-పోతంగల్

పోతంగల్ మండలంలోని మంజీరా అంతర్జాతీయ చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా మహారాష్ట్ర నుండి తెలంగాణ వైపు వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా నగేష్ పేట్కార్, అనుగొండ నాందేడ్ వద్ద నుంచి రూ.2,29,000 నగదును అధికారులు సీజ్ చేసి బాన్సువాడ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. వాహనదారులు ఎవరు కూడా 50 వేల కన్నా ఎక్కువ డబ్బులతో ప్రయాణిస్తే సరైన పత్రాలను చూయించాలని ఎస్సై సందీప్ తెలిపారు.



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ

అవినీతికి అంతం ఎప్పుడో..?

- ఏసీబీ దాడులతో ఉలిక్కిపడ్డ అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లాలోని కమ్మర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారుల దాడులతో డివిజన్ కేంద్రం పట్టణంలో వివిధ శాఖల అధికారులు ఉలిక్కిపడ్డారు.. గత నెల 5వ తేదీ జక్రాన్ పల్లి మండలంలోని తొర్లికొండ గ్రామ సెక్రెటరీ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.

ఉమ్మడి జిల్లాల్లో...

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉమ్మడి జిల్లాలలో అవినీతి కేసులు రోజు రోజుకు పెరుగుతున్నవి.. అవినీతి కేసులలో రెవెన్యూ ప్రథమ స్థానంలో ఉండగా పోలీస్ శాఖ సైతం రెవెన్యూ శాఖతో పోటీ పడుతోంది.. ఆ తర్వాత పంచాయతీరాజ్,, విద్యాశాఖ, విద్యుత్, రిజిస్ట్రేషన్ శాఖలు సైతం పోటీ పడుతున్నాయి. 2017 సంవత్సరంలో ఆర్మూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయంపై, 2018 జనవరి నెలలో రెవెన్యూ డివిజనల్ అధికారిగా పని చేసిన బాలే శ్రీనివాస్ వాటర్ ప్లాంట్ యజమాని నుండి డబ్బులు డిమాండ్ చేస్తూ ఏసీబీకి చిక్కారు. 2022 సంవత్సరం పట్టణంలోని పెర్కిట్ ఐసిడిఎస్ కార్యాలయ ఇన్చార్జి పి డి సిడిపిఓ ఝాన్సీ లక్ష్మి డాటా ఎంట్రీ ఆపరేటర్ ఏసీబీ డీఎస్పి అధికారులు పట్టుకున్నారు. గత సంవత్సరం తెలంగాణ యూనివర్సిటీలో ఏసీబీ దాడులు తీవ్ర కలవరం రేపాయి.

విధుల పట్ల నిర్లక్ష్యం...

పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం మచ్చ తెస్తున్నవి. సమయ పాలన పాటించక ఇష్టారీతిన వస్తున్నారు. ప్రతి శాఖలో సంబంధిత శాఖకు సంబంధించిన నిధుల విడుదల, ఖర్చులు, నిధులు, ప్రయోజనాలు, పనులు ఏ స్థాయిలో ఉన్నవి నిధుల పరిస్థితి ఏమున్నది .స్పష్టంగా సమాచారం బోర్డుపై ప్రతి కార్యాలయంలో ఏర్పాటు చేయాలి. ఇవి ఏమి జరగట్లేదు కొన్ని శాఖలు ముడుపులకు అలవాటు పడి ఇవి పట్టించుకోవడం లేదు. సంబంధిత కార్యాలయాల్లో వివరాలు అడిగితే బెదిరించడం, భయపెట్టడం జరుగుతుంది.

అవగాహన పెరిగేందుకు కృషి చేయాలి....

అధికార కాంగ్రెస్ ప్రభుత్వం విధుల పట్ల నిర్లక్ష్య వైఖరి వహిస్తున్న అధికారులపై ప్రత్యేక నిఘా పెట్టాలి. అవినీతి నిర్మూలనలో కీలక పాత్ర పోషించే ఏసీబీ శాఖపై సాధారణ ప్రజల్లో మరింత అవగాహన పెంచాలి. ఎలాంటి పనికైనా సరే ప్రభుత్వ అధికారులకు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని , అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు కఠిన తరం చేస్తే ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయచ్చని పలువురు విద్యావేత్తలు అన్నారు.



కీచక ఉపాధ్యాయుడు సస్పెండ్

ఉత్తర్వులు జారీ చేసిన డీఈవో

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలం జప్తి జాన్కంపల్లి ప్రాథమిక పాఠశాల కీచక ఉపాధ్యాయుడు ప్రవీణ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి రాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈఓ వెంకటేశం మంగళవారం తెలిపారు.